బాల త్రిపుర సుందరిగా చాముండేశ్వరి



దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారు ఆదివారం బాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో చండీ హవణం, రుద్రహవణం, మహాహారతి, పల్లకీసేవ, పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సిద్ధారెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



అట్ల బతుకమ్మ సంబరం

జిల్లాకేంద్రంలో ఎస్‌ఆర్‌కే డిగ్రీ కళాశాలలో..

జిల్లావ్యాప్తంగా మహిళలు బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఆదివారం అట్ల బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. కళాశాల విద్యార్థినులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం నీళ్లలో నిమజ్జనం చేశారు. సద్దులు ఆరగించారు. **- కామారెడ్డి పట్టణం**

జిల్లాకేంద్రానికి చెందిన వ్యాపారి పరుశురాం(40) ఈ నెల 4న ఉదయం నుంచి సాయంత్రం వరకు దుకాణంలో బాగానే ఉన్నారు. వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లాక తీవ్ర జ్వరం వచ్చింది. మరుసటి రోజు ఒంటి నొప్పులతో ఇబ్బంది పడ్డారు. అప్పటిదాకా బాగా ఉన్న ఆయన ఆరోగ్యం క్షీణించింది. కామారెడ్డిలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. పరీక్షలు చేసి ఔషధాలు ఇచ్చారు. సెలైన్ పెట్టారు.



కామారెడ్డిలోని అశోక్‌నగర్‌కు చెందిన రాజయ్యకు అంతగా జ్వరం వచ్చేది కాదు. శరీరం నీరసపడగానే ఆయన జాగ్రత్తపడేవారు. ఆహారపు అలవాట్లలో మార్పు చేసుకుంటారు. ఈ నెల 5న ఉన్నట్టుండీ ఆరోగ్యం దెబ్బతింది. తీవ్ర జ్వరం, కీళ్లనొప్పులతో బాధపడ్డారు. అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కోలుకోవడానికి పది రోజులు పడుతుందని వైద్యులు సూచించారు.

భిన్న వాతావరణం.. వ్యాధులకు ఆస్కారం

తగ్గని జ్వరాలు, ఒంటి నొప్పులు ● అప్రమత్తతే మేలంటున్న వైద్యాధికారులు

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులకు ఆస్కారం ఉంది. అప్పుడే ఎండ.. అంతలోనే వర్షం.. కాసేపు ఉక్కపోత.., ఆ తర్వాత చలి ఇలా వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా రోగనిరోధకశక్తి తక్కువ ఉన్నవారిపై వైరస్, బ్యాక్టీరియాల ప్రభావం చూపుతోంది. జ్వరం, ఒంటినొప్పులు, నీరసం వంటి లక్షణాలు వెలుగుచూస్తున్నాయి. కొందరేమో మరీ బలహీనంగా మారుతున్నారు. జ్వరం తగ్గినా శరీరం సహకరించడం లేదని వాపోతున్నారు.

డెంగీ.. చికున్‌గన్యా లక్షణాలు

శరీరంలో అనేక మందిలో ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నాయి. డెంగీ బారిన పడిన వారిలో ఇవి 30 వేలకు పడిపోతున్నాయి. సెప్టెంబరు నెలాఖరుకు వరకు తగ్గినా అక్టోబరులో తిరిగి డెంగీ కేసులు నమోదవుతున్నాయని ఇటీవల వైద్యశాఖ ప్రకటించింది. డెంగీ లక్షణాల మాదిరిగా చికున్‌గన్యాలో వెలుగుచూస్తున్నాయి. 50 వేల నుంచి 1 లక్ష వరకు ప్లేట్‌లెట్స్ ఉంటున్నాయి. దీంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ, గన్యా కేసులు అధికంగా నమోదవుతున్నాయి.

రోగ నిరోధకశక్తి క్షీణించి..

మనిషిలో రోగ నిరోధకశక్తి ఉన్నా ఆరోగ్యం క్షీణించినప్పుడు శరీరం సహకరించదు. ఈ సమయంలో బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ద్రవరూప పదార్థాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని చెబుతున్నారు. నాలుగైదు రోజుల వరకు పోషకాహారం తీసుకోవడంలో విభిన్న పద్ధతులు పాటిస్తే ఆరోగ్యం మెరుగవుతుంది.



జిల్లా ఆసుపత్రిలో రద్దీ

జిల్లా ఆసుపత్రిలో

	ఓపీ	ఐపీ
జులై	24018	1626
ఆగస్టు	21859	1973
సెప్టెంబరు	24122	1960

మూడు మాసాల్లో ఓపీ

పీహెచ్‌సీలు	23	34500
సీహెచ్‌సీలు	10	2386

పోషకాహారం తీసుకోవాలి

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా జ్వర కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టాం. 3 వేల పైచిలుకు మంది జ్వరాల బారిన పడినట్లు తేలింది. తిరిగి అక్టోబరు నెలలో రోగనిరోధశక్తి తక్కువ ఉన్నవారి ఆరోగ్యంపై జ్వరం, ఒంటినొప్పుల ప్రభావం ఉంది. ఈ సమయంలో ఆందోళన పడొద్దు. పోషకాహారం తీసుకోవాలి.

- చంద్రశేఖర్, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి-కామారెడ్డి

అసైన్డ్ భూములపై కన్ను

గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరిస్తున్న ముఠా

ఈనాడు, కామారెడ్డి

నిరుపేదలు సాగుచేసుకునేందుకు ప్రభుత్వం అసైన్డ్ భూములను పంపిణీ చేసింది. కొందరు భూ బకాసురులు పేదల అవసరాలను గుర్తించి అరకొర ధరలు చెల్లించి వీటిని స్వాధీనం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో పోడు, అసైన్డ్ భూముల లబ్ధిదారులకు అన్ని యాజమాన్య హక్కులు కల్పిస్తామని ప్రకటించి మ్యానిఫెస్టోలో చేర్చిన విషయం తెలిసిందే. ఈ హామీ కార్యరూపం దాల్చే అవకాశం ఉందనే ఉద్దేశంతో జిల్లాలోని ప్రభుత్వ భూముల గుట్టు తెలిసిన ఓ ముఠా భిక్కనూరు మండలంలోని జంగంపల్లిలో పాగా వేసి అసైన్డ్ భూములను కొనుగోలు చేస్తోంది. నెల రోజుల నుంచి ఇప్పటి వరకు పలు గ్రామాల్లో సుమారు 25 ఎకరాల మేర భూములను సేకరించారు. మరిన్ని సేకరించేందుకు పల్లెల్లో తిరుగుతూ అసైన్డ్‌దారులను మచ్చిక చేసుకుంటున్నారు.

నిబంధనల ప్రకారం..

అసైన్డ్ భూములను సాగు చేసుకోవడం తప్ప క్రయవిక్రయాలు నిషిద్ధం. లబ్ధిదారులు ఇతరుల పేరిట తమ భూములను ప్రభుత్వ దస్త్రాల్లో మార్చుకునేందుకు వీలు లేకుండా ఈ భూములను నిషేధిత జాబితా22(ఎ)లో నమోదు చేశారు. అసైన్డ్‌దారులు మరణిస్తే వారసులకు సంక్రమిస్తుంది ఇతరులకు దానిపై హక్కు ఉండదు. కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల హామీ కార్యరూపం దాల్చితే అసైన్డ్‌దారులకు యాజమాన్య హక్కులు కల్పించే అవకాశం ఉంటుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆయా భూములపై రుణాలు తీసుకోవడంతో పాటు ఇతరత్రా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందే ఏర్పాట్లు చేస్తుందంటున్నారు.



మొదలైన విచారణ

44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉండడం, పరిశ్రమల స్థాపనతో జంగంపల్లి ప్రాంతంలోని భూముల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో అక్రమార్కులు అసైన్డ్ భూములను తక్కువకు కొట్టేసి ఎన్వోసీల పేరిట స్వాహా చేసేందుకు పన్నాగాలు పన్నుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ ఉన్నతాధికారుల అండదండలతో కొందరు అక్రమార్కులు తప్పుడు పత్రాలతో జంగంపల్లిలోని ప్రభుత్వ అసైన్డ్‌భూములకు ఎన్వోసీలు పొంది పట్టాభూములుగా మార్చిన విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ దందాపై కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు దస్త్రాల పరిశీలన చేపట్టారు. ఎన్వోసీలు ఏ విధంగా జారీచేశారు? సమర్పించిన దస్త్రాలపై విచారణ చేపట్టారు. సీసీఎల్ఏ(భూ పరిపాలన కార్యాలయం) నుంచి ఎన్వోసీ జారీ సమయంలో సమర్పించిన దస్త్రాల కోసం అధికారులు లేఖ రాసినట్లు సమాచారం.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా చంద్రకాంత్‌రెడ్డి



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా మద్ది చంద్రకాంత్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన స్వస్థలం భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి. 34 ఏళ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. ఎన్ఎస్‌యూఐ గ్రామ, మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఉమ్మడి జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, మండల అధ్యక్షుడిగా కొనసాగారు. 2001లో భిక్కనూరు జడ్పీటీసీ సభ్యుడిగా పోటీ చేశారు. అనంతరం భిక్కనూరు మండల అధ్యక్షుడిగా ఉన్నారు. 2013- 18 వరకు రామేశ్వర్‌పల్లి సర్పంచిగా, 2019-24 వరకు ఎంపీటీసీ సభ్యుడిగా, ఆ తర్వాత జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. సిద్దిపేట నియోజకవర్గానికి సభ్యత్వ నమోదు బాధ్యుడిగా కీలక పాత్ర పోషించారు. ఏఐసీసీ రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ జోనల్ కోఆర్డినేటర్‌గా ఉన్నారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవికి జిల్లాకేంద్రం నుంచి ముగ్గురు, ఎల్లారెడ్డి, బాన్సువాడ నుంచి పలువురు పోటీ పడ్డారు. సుదీర్ఘకాలంగా పార్టీకి విధేయుడిగా ఉన్న మద్ది చంద్రకాంత్‌రెడ్డికి తగిన ప్రాధాన్యం దక్కిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మద్యం అమ్మినా, తాగినా రూ. 50వేల జరిమానా

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మండలం అజామాబాద్‌లో మద్యం గొలుసు దుకాణాలను మూసివేస్తూ ఆదివారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. మద్యం అమ్మినా, తాగినా రూ. 50 వేల జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. యువత భవిష్యత్తు బాగు కోసం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



తీర్మాన పత్రం చూపుతున్న గ్రామస్థులు

ఈ-కేవైసీ నమోదుకు గడువు పెంపు

● రేషన్ లబ్ధిదారులకు మరో అవకాశం ● జిల్లాలో 86 శాతం పూర్తి

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

రేషన్‌కార్డుకు ఈకేవైసీ నమోదు ప్రక్రియను ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబరు 31 వరకు పొడిగించింది. ఇప్పటి వరకు జిల్లాలో 86 శాతం ప్రక్రియ పూర్తయింది. అయితే గత ఆరు నెలల నుంచి కేవలం 5 శాతం మంది మాత్రమే నమోదు చేయించుకున్నారు. మిగతా వారికి ఆధార్ నవీకరణ, బయోమెట్రిక్ తదితర సమస్యలు ఉత్పన్నమయ్యాయి. నిర్ణయించిన గడువులోగా ప్రక్రియ పూర్తి చేసుకోకుంటే వచ్చే ఏడాది నుంచి బియ్యం నిలిపివేసే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 2,53,305 రేషన్‌కార్డులు ఉండగా 8,94,586 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 7,69,343 మందికి ఈ-కేవైసీ పూర్తయింది. ఇంకా 1,25,243 మంది చేయించుకోవాల్సి ఉంది.



వేలిముద్ర వేస్తున్న వృద్ధురాలు

ఆలస్యం ఎందుకంటే..

ఆధార్ నవీకరణ(అప్‌డేట్) లేక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ఆధార్ కేంద్రాల్లో వేలిముద్రలు పడటం లేదు. దీంతో వినియోగదారులు వేర్వేరు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఆధార్ నవీకరణ పూర్తికాక పోవడంతో చిన్నారులు ఈకేవైసీకి దూరమవుతున్నారు. పలు చోట్ల మృతుల వివరాలు కార్డుల నుంచి తొలగించక పోవడం సమస్యగా మారింది.

ఆధార్ కేంద్రాలు తక్కువ..

ఆధార్ కేంద్రాలు కనీసం మండలానికి ఒకటి కూడా లేవు. కేంద్రాలు లేని మండలాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి కనీసం మండలానికి ఒక కేంద్రం ఏర్పాటు చేయాలి. కొన్ని మండలాలకు కేటాయించిన ఆధార్ కేంద్రాలను పట్టణాల్లో నడుపుతున్నారు. పలు మండలాల్లో మాత్రం రెండేసి ఉన్నాయి. ఇవన్నీ ఈకేవైసీ నమోదుపై ప్రభావం చూపిస్తున్నాయి.

తప్పనిసరి చేయించుకోవాలి

- నర్సింహారావు, ఏఎస్‌వో, కామారెడ్డి

రేషన్‌కార్డుకు ఈ-కేవైసీ నమోదు చేయించుకునే గడువును ఈ ఏడాది చివరి వరకు పెంచారు. అర్హులందరు నమోదు చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేయరాదు.

కొలువులు దాసోహం

ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అరుణ

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

ఆమె పట్టుదలకు సర్కారు కొలువులు దాసోహమయ్యాయి. వివాహం తర్వాత ఓవైపు కుటుంబ బాధ్యతలు మోస్తూ మరోవైపు తన లక్ష్యానికి బాటలు వేసుకున్నారు. పట్టుదల, కృషితో 2018 నుంచి ఇప్పటి వరకు ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఆమె ఎవరో కాదు.. కామారెడ్డి పట్టణానికి చెందిన కాసుల అరుణ. తాజాగా డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం)లో జనరల్ విభాగంలో 4వ ర్యాంకు(రోస్టర్ పాయింట్ల ప్రకారం 1వ ర్యాంకు) సాధించారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మహాత్మా జ్యోతిబాపులే గురుకులంలో డిగ్రీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



విజయం వెనక భర్త

కామారెడ్డికి చెందిన సంస్కృత ఉపాధ్యాయులు నృసింహమూర్తి-అపర్ణల కుమార్తె అరుణ. ఎంఏ, బీఈడీ చదివిన ఆమెకు పేర్వాల సతీష్‌శర్మతో వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో సెట్‌కు అర్హత సాధించారు. ఇంటివద్దే ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. 2015 వరకు కామారెడ్డిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో పనిచేశారు. 2018లో గురుకులాల నియామకాల్లో టీజీటీ, పీజీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దౌల్తాబాద్ జ్యోతిబాపులే గురుకులంలో పీజీటీగా నియమితులయ్యారు. తర్వాత 2019లో జేఎల్(జూనియర్ లెక్చరర్)గా ఎంపికై నార్కెట్‌పల్లి జ్యోతిబాపులే గురుకులంలో విధుల్లో చేరారు. అనంతరం డీఎల్(డిగ్రీ లెక్చరర్)గానూ ఎంపికయ్యారు. అప్పటికే జేఎల్ నుంచి డీఎల్‌గా పదోన్నతి వస్తుందని నేరుగా వచ్చిన ఉద్యోగాన్ని వదులుకున్నారు.

మరొకరికి అవకాశం ఇవ్వాలని..

అరుణ తాను సాధించిన ఐదు ఉద్యోగాల్లో మూడు ఉద్యోగాలకు నాట్ విల్లింగ్ లేఖలను అధికారులకు అందజేశారు. ఇలా ఇవ్వడం వల్ల ఆ ఉద్యోగాలు ఇతరులకు దక్కుతాయని ఆమె భావించారు. టీజీటీ, డీఎల్ ఉద్యోగాలు వచ్చినప్పుడు నాట్ విల్లింగ్ లేఖ ఇచ్చారు. తాజాగా డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్‌గా 4వ ర్యాంకు సాధించినప్పటికీ డీఈవోకు నాట్ విల్లింగ్ లేఖను అందజేశారు. తల్లిదండ్రులు, సోదరి శ్రీవాణి, భర్త సతీష్‌శర్మ సహకారంతో విజయాలు సాధించినట్లు అరుణ పేర్కొంటున్నారు. చేసే పనిలో ఏకాగ్రత చూపితే యువతకు విజయం దక్కుతుందని ఆమె సూచిస్తున్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే..!



ముత్యంపేట-భవానిపేట మార్గంలో తెగిపోయి ప్రమాదకరంగా రోడ్డు

దోమకొండ మండలంలోని ముత్యంపేట-భవానీపేట రోడ్డు మార్గం ప్రమాదకరంగా మారింది. నెలరోజుల కిందట కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతింది. బీటీ పక్కనే గల ఫార్మేషన్ రోడ్డు (మట్టిరోడ్డు మార్గం) కోసుకుపోయింది. కల్వర్టుల కింద వేసిన పైపులు నిండి వర్షపు నీటి వరద ప్రవాహం ఎక్కువవటంతో రహదారి ప్రమాదకరంగా మారింది. బీటీకి ఒక వైపు రోడ్డు కోతకు గురై ప్రమాదాలకు హేతువుగా నిలిచింది. వాహనదారులు ఆదమరచి ప్రయాణిస్తే.. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు తెలుపుతానని స్థానిక వర్క్ ఇన్‌స్పెక్టర్ అన్నారు. **- దోమకొండ, న్యూస్‌టుడే**

వీధి కుక్కలతో బెంబేలు



బొమ్మన్‌దేవుపల్లిలో రోడ్డుపై శునకాలు గుంపు

బొమ్మన్‌దేవ్‌పల్లిలో వీధి కుక్కలు కొద్ది రోజుల నుంచి మేకలు, గొర్రెలు, కోడి పిల్లలపై దాడి చేసి చంపుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పిల్లలు రాత్రి వేళల్లో దుర్గామాత ఉత్సవాలకు, బతుకమ్మ సంబరాలకు ఒంటరిగా వెళ్లేందుకు జంకుతున్నారని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నస్రుల్లాబాద్**

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

మహ్మద్‌నగర్, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని సొసైటీ అతిథిగృహంలో ఆదివారం వివిధ గ్రామాల నాయకులతో సమస్యలపై చర్చించారు. కాంగ్రెస్ నాయకులు ఏకతాటిపై నిలబడి ప్రజల, గ్రామ సమస్యలను పరిష్కరించి మన్నన పొందాలని తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు ఆకాష్, నాయకులు రాజు, గంగి రమేష్, భాస్కర్‌రెడ్డి, నాగభూషణ్‌గౌడ్, సిద్ధు, సవాయిసింగ్, లోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

ఉపాధ్యాయుడిగా ఉత్తమ సేవలు



క్రీడాకారులతో ఎమ్మెల్యే పోచారం, ఆగ్రోస్ ఛైర్మన్ బాల్‌రాజ్

బాన్సువాడ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడిగా గురు బసంత్ ఉత్తమ సేవలు అందించారని ఎమ్మెల్యే, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురు బసంత్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సీనియర్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన క్రికెట్ ఆడి సందడి చేశారు. బసంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆగ్రోస్ రాష్ట్ర ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఖాలెక్, ఎజాస్, నారాయణరెడ్డి, మినీస్టేడియం బాధ్యులు నరేష్, సీనియర్ క్రికెటర్లు పాల్గొన్నారు.

ముద్దచర్మ వ్యాధితో గోస



జిల్లాకేంద్రంలోని గాంధీ గంజ్ ప్రాంతంలో ముద్దచర్మ వ్యాధికి గురైన లేగదూడ

జిల్లాకేంద్రంతో పాటు సదాశివనగర్, రామారెడ్డి, కామారెడ్డి మండలాల్లో ముద్దచర్మ (లంపీస్కిన్) వ్యాధి తెల్లజాతి పశువులను పట్టి పీడిస్తోంది. జిల్లావ్యాప్తంగా 1,14,092 ఆవులు-ఎద్దుల వంటి తెల్లజాతి పశువులు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధితో పశువుల చర్మంపై రంధ్రాలు ఏర్పడి గాయాలై రక్తం కారుతోంది. అధికారులు స్పందించి పశువులను గుర్తించి టీకాలు వేయాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కామారెడ్డి వ్యవసాయం**

సమీప కేంద్రాలే దిక్కు

● దుబ్బ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 120 ■ నొప్పుల మందులు, యాంటీబయోటిక్స్, దగ్గు మందుల కొరత ఉంది. ☛ మందులు సరిపడా లేకపోవడంతో వేరే యూపీహెచ్‌సీల నుంచి తెప్పించుకుంటున్నారు. ➾ సీజనల్ వ్యాధులతో ఓపీ పెరిగింది. పక్కనున్న యూపీహెచ్‌సీల నుంచి మందులు తెప్పించి తమకు రాగానే ఇచ్చేస్తున్నామని వైద్యాధికారిణి శ్రీలత చెప్పారు. - న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్య విభాగం



సమయపాలన కరవు

● నందిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 100 ■ ఒళ్లు నొప్పులు, దగ్గు మందులు లేవు. ☛ సిబ్బంది ఆలస్యంగా వస్తున్నారని రోగులు చెబుతున్నారు. ➾ మందుల కొరత లేకుండా చూస్తామని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ భాస్కర్ తెలిపారు. - న్యూస్‌టుడే, నందిపేట్



నందిపేట్‌లో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సిబ్బందిని పెంచాలి

● భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 130 ■ మందులు ఉన్నాయి. ☛ భిక్కనూరు పీహెచ్‌సీ పరిధిలో ఏడు ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉండాలి. ఒక్క పెద్దమల్లారెడ్డి ఉప కేంద్రంలో తప్ప మిగతా అన్నింటా ఒక్కొక్కరే విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున భిక్కనూరు పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భిక్కనూరు



ఆ మాత్రం లేవా..!

● పీహెచ్‌సీల్లో మందుల కొరతతో రోగుల ఇబ్బందులు

ఉమ్మడి జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరం తగ్గినా నొప్పులు రోగులను వదలడం లేదు. ఉమ్మడిజిల్లాలోని సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌లో మందుల నిల్వలు నిండుకున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అరకొరగానే సరఫరా చేస్తుండడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. శని, ఆదివారాల్లో 'న్యూస్‌టుడే' పీహెచ్‌సీలను పరిశీలించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

పిల్లల ఔషధాల కొరత

○ నవీపేట ◆ 150 నుంచి 200 ■ చిన్న పిల్లలకు సంబంధించిన యాంటీబయోటిక్ మందులు, ఇతర లేపనాల కొరత ఉంది. ☛ వైద్యుల్లో ఒకరు విధులు నిర్వహిస్తుండగా మరొకరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ➾ వైద్యాధికారిణి కావ్య మాట్లాడుతూ.. బఫర్‌స్టాక్ నుంచి 20శాతం మందులు తీసుకోవడంతో ఔషధాల కొరత లేదన్నారు. - న్యూస్‌టుడే, నవీపేట



పరిశీలన

● పీహెచ్‌సీ పేరు
◆ నిత్యం వచ్చే రోగుల సంఖ్య
■ సరిపడా మందులు ఉన్నాయా? లేవా?
☛ గుర్తించిన అంశాలు
➾ అధికారి వివరణ

చిన్నారుల టీకాలు లేవు

● భీమ్‌గల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ◆ 150 ■ చిన్నారులకు అవసరమైన పలు రకాల వ్యాక్సిన్ల కొరత ఉంది. ☛ రెగ్యులర్ వైద్యుడు లేడు. ఇక్కడ పనిచేసే అజయ్‌పవార్ కిసాన్‌నగర్ బదిలీ అయి.. డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు. ➾ వారం రోజుల్లో వ్యాక్సిన్లు వచ్చే అవకాశముందని వైద్యాధికారి అజయ్‌పవార్ తెలిపారు. - న్యూస్‌టుడే, భీమ్‌గల్

ప్రాథమిక వైద్యం చేస్తూ.. పంపించేస్తూ

● మోర్తాడ్ సీహెచ్‌సీ ◆ 95 ■ మందులున్నాయి ☛ ఆసుపత్రిలో కేవలం ఇద్దరే వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. కుక్క, పాము కాట్లకు ప్రాథమిక చికిత్స చేసి ఆర్మూర్, మెట్‌పల్లి, నిజామాబాద్ ఆసుపత్రులకు పంపిస్తున్నారు. ➾ అన్ని మందులున్నాయి. కుక్క, పాము కాట్లకు ప్రాథమిక చికిత్స చేసి ఆర్మూర్, నిజామాబాద్ ఆసుపత్రులకు పంపిస్తున్నామని అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, మోర్తాడ్

స్టాఫ్‌నర్సులే ల్యాబ్‌టెక్నీషియన్లు

● పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 100 ■ మందులున్నాయి. ☛ వైద్యుల కొరత ఉంది. రక్త, ఇతర పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో స్టాఫ్‌నర్సులే ఆ పని చేస్తున్నారు. ➾ ల్యాబ్ టెక్నీషియన్ కావాలని విన్నవించామని వైద్యుడు అనిల్ తెలిపారు. - న్యూస్‌టుడే, బాల్కొండ

ఒళ్లు నొప్పులొస్తే తిప్పలే

● ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 120 ■ కంటి చుక్కల మందు, టీటీ ఇంజెక్షన్లు, దగ్గు, ఎలర్జీ, నొప్పులకు సంబంధించిన ఔషధాలు లేవు. ☛ భవనం చిన్నగా ఉండటంతో సామగ్రి పెట్టడానికే సరిపోతుంది. ➾ త్వరలోనే ఔషధాల కొరత సమస్యను పరిష్కరిస్తామని మండల వైద్యాధికారి సంతోష్‌కుమార్ వివరించారు. - ఇందల్‌వాయి

అరకొరగా ఇస్తూ..

● ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 80 ■ జ్వరం, దగ్గు, తల, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలు, చర్మ సంబంధ వ్యాధుల మాత్రలు, బాలింతలు, గర్భిణులకు కావాల్సిన ఐరన్ ఇంజెక్షన్లు అరకొరగా ఉన్నాయి. ☛ ఇండెంట్ పెట్టినంత మందులు ఇవ్వకపోవడంతో అరకొరగా ఇస్తున్నారు. ➾ రోగికి అవసరమైన మందులు రాసి ఇస్తున్నాం. ఫార్మసిస్టు అరకొరగా ఇస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని వైద్యులు ప్రత్యూష, అలేఖ్య తెలిపారు. - మోపాల్

బయట కొనాల్సిందే...

● సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 110 - 120 ■ రక్తపోటు, మధుమేహం మాత్రలు, కంటి మందులు, ఎలర్జీ ఆయింట్‌మెంట్స్, దగ్గు మందు కొరత ఉంది. ☛ మాత్రల కొరతతో రోగులు బయట కొనుగోలు చేస్తున్నారు. రక్త పరీక్షలు కామారెడ్డిలోని టీ-హబ్‌కు పంపడంతో ఫలితాల వెల్లడిలో జాప్యం జరుగుతోంది. ➾ డ్రగ్స్ స్టోరు నుంచి మందులు సరఫరా చేయడంలో జాప్యం జరుగుతోందని వైద్యురాలు ఆస్మా తెలిపారు. - న్యూస్‌టుడే, సదాశివనగర్

విధులకు గైర్హాజరు




● సీహెచ్‌సీ, జుక్కల్ ◆ 110 పైనే ■ చర్మ సంబంధ వ్యాధుల మందులు లేవు ☛ ఔషధాల విభాగంలో మందులు ఇచ్చే వారు విధులకు గైర్హాజరవుతున్నారు. మందులైనా నర్సులే ఇస్తున్నారు. ➾ కొన్ని మందులు సరఫరా కావడం లేదని వైద్యాధికారి విఠల్ తెలిపారు. - జుక్కల్

ఇన్‌ఛార్జి వైద్యుడే ఆధారం

● హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 100 నుంచి 120 ■ నొప్పుల బిళ్లలు, యాంటీ బయాటిక్స్ లేవు ☛ రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో ఇన్‌ఛార్జి వైద్యుడితో నెట్టుకొస్తున్నారు. స్టాఫ్‌నర్సు, ఇద్దరు ఏఎన్‌ఎంల అవసరం ఉంది. ➾ ప్రస్తుతం అన్ని మందులు ఉన్నాయని.. ఇన్‌ఛార్జి వైద్యుడితో సమావేశం, ఇతర సంతకాలు అవసరం ఉన్నప్పుడు రోగులకు సేవలు అందించలేకపోతున్నామని పీహెచ్‌సీ బాధ్యుడు సాయికుమార్ చెప్పారు - బాన్సువాడ

ఇక్కడ లెక్కే వేరు

● కోటగిరి సీహెచ్‌సీ ◆ 150 ■ జ్వరానికి సంబంధించిన ఔషధాలు అవసరం.. ☛ వైద్యురాలు సూచించిన దానికంటే తక్కువగా ఇచ్చి రిజిస్టర్‌లో ఎక్కువగా నమోదు చేస్తున్నారు. ఈ విషయమై ఓ రోగి కుమారుడు వైద్యురాలిని ప్రశ్నించగా.. చీటీలో ఉన్న మందుల సంఖ్య 8ని దిద్దుబాటు చేసి 4 రాసి చేతిలో పెట్టి పంపారు. ➾ ఆసుపత్రిలో జరిగిన విషయాన్ని ఉప వైద్యాధికారిణి సమత దృష్టికి తీసుకెళ్లగా మందుల కొరత లేదన్నారు. స్టాకు రావడంలో ఆలస్యం జరుగుతుందని చెప్పారు. రిజిస్టర్‌లో నమోదు విషయమై పరిశీలిస్తామని చెప్పారు. - కోటగిరి



కోటగిరి సీహెచ్‌సీ వైద్యురాలు రోగికి రాసిన మందులు

సరఫరా.. అరకొర

● రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 100 ■ దగ్గు, జలుబు మందులు, చర్మ సంబంధ వ్యాధుల ఆయింట్‌మెంట్లు లేవు ☛ ఫార్మసిస్ట్, స్టాఫ్‌నర్సు బదిలీ కావడంతో ఒకరు డిప్యుటేషన్, ఇంకొకరు ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ➾ పెట్టిన ఇండెంట్‌లో 30 శాతం మందులు పంపుతున్నారని వైద్యురాలు అయేషా సిద్ధిఖీ తెలిపారు. - న్యూస్‌టుడే, రుద్రూర్

జలుబు గుబులు

● దోమకొండ ◆ 400 ■ దగ్గు, జలుబు, రక్తపోటు మందులు లేవు. టీటీ ఇంజెక్షన్ల కొరత ఉంది. ☛ పిల్లలకు అవసరమైన జలుబు, దగ్గు, అలర్జీ మందులు లేకపోవడంతో ప్రైవేటులో కొనాల్సిన పరిస్థితి. ఫార్మసిస్టు రెండు నెలలుగా లేకపోవటంతో మందుల అవసరాన్ని గుర్తించే వారే కరవయ్యారు. ➾ మందులు అరకొరగానే వస్తున్నాయని.. అత్యవసరమైనవి ప్రత్యేక నిధుల నుంచి కొనుగోలు చేసుకొస్తున్నామని పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. - న్యూస్‌టుడే, దోమకొండ



కోతికాటు మందుల్లేవ్

● కల్లెడ ప్రాథమిక వైద్య కేంద్రం ◆ 100 ■ కోతికాటు, మధుమేహం మందుల కొరత ఉంది. ☛ పిచ్చి మొక్కలు పెరిగి, మురుగు నిలుస్తోంది ➾ రోగుల తాకిడి పెరిగింది. కానీ మందులు ఇంకా అవసరమని వైద్యాధికారి ప్రకాశ్ తెలిపారు. - న్యూస్‌టుడే, మాక్లూర్ గ్రామీణం



వైద్యులు లేరు..

● బిచ్కుంద పీహెచ్‌సీ ◆ 100 - 150 ■ చర్మ సంబంధ వ్యాధుల లేపనాలు, కన్ను, చెవికి సంబంధించిన మందులు అవసరం ☛ నిత్యం మధ్యాహ్నం వరకు మాత్రమే వైద్యులు ఉంటారు. ఆ తర్వాత స్టాఫ్‌నర్సులు చికిత్స చేస్తున్నారు. ➾ ఇద్దరు వైద్యులు ఇన్‌ఛార్జులు కావడంతో ఇబ్బందులు తలెత్తాయని పర్యవేక్షణ అధికారి కళాదాస్ చెప్పారు. - న్యూస్‌టుడే, బిచ్కుంద





ఎంపికైంది వీరే..

జాతీయస్థాయికి జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 10 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో జరిగే 42వ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

బాలికలు : సౌమ్యరాణి(పందిమడుగు), సాత్విక, శ్రావిక (పిప్రి), సన్నిత(పుప్పాలపల్లి), సోనీ(మంచిప్ప), వైశాలి(అక్లూర్)

బాలురు : అర్విందర్(బడా భీమ్‌గల్), లక్వేందర్(ఆర్మూర్), అభినాష్(ఆర్మూర్)

యోగాసనాల్లో విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ పటాన్‌చెరులో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన యోగాసన పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. బాలుర విభాగంలో రెడ్డిపేట తండా ఉన్నత పాఠశాలకు చెందిన సందీప్, నవదీప్‌లు బంగారు పతకాలు, సబ్ జూనియర్ బాలికల విభాగంలో నిఖిత(కేజీబీవీ మాచారెడ్డి)బంగారు పతకం, సహస్ర(కేజీబీవీ మాచారెడ్డి) రెండో స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. వీరితో పాటు జిల్లాకు చెందిన సునీత, కవిత, నిఖిత, సరస్వతి, సింధుజలు పతకాలు సాధించారని చెప్పారు. జూనియర్ బాలికల విభాగం నుంచి ఐశ్వర్య, అనిత, నిహారిక, కల్యాణిలు ప్రతిభ చాటారని వివరించారు.





పతకాలతో విద్యార్థులు

బాల్ బ్యాడ్మింటన్ విజేతలు రంగారెడ్డి, ఖమ్మం జట్లు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి ప్రథమ బహుమతి సాధించగా, ఆదిలాబాద్ ద్వితీయ, వరంగల్ తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ బహుమతి ఖమ్మం దక్కించుకోగా హైదరాబాద్ ద్వితీయ, వరంగల్ తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర కార్యదర్శి రమణ, ప్రతినిధులు లోయపల్లి నర్సింగరావు, మధు, శశి, చిన్నయ్య, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



బహుమతి అందుకుంటున్న రంగారెడ్డి జట్టు

ఎల్లలు దాటిన బతుకమ్మ

● విదేశాల్లోనూ ఆడుతున్న ఇందూరు మహిళలు ●

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఎక్కడ ఉన్నా.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. పల్లె సంస్కృతికి పట్టాభిషేకం చేస్తున్నారు.. మనదైన బతుకమ్మను ఎల్లలు దాటినా సంబరంగా జరుపుకొంటున్నారు.. అక్కడ కూడా తీరొక్క పూలతో అమ్మవారిని పేర్చి పాటలు పాడుతూ ఆటలు ఆడుతున్నారు విదేశాల్లో ఉన్న మన ఇందూరువాసులు. ఉన్నత చదువులు, ఉద్యోగాల నిమిత్తం ఆయా దేశాల్లో స్థిరపడిన జిల్లా మహిళలు అక్కడా పూల పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.. ఈ నేపథ్యంలో 'ఈనాడు'తో తమ మనోగతాలు పంచుకున్నారు.



సంబురాల్లో పాల్గొన్న జిల్లా మహిళలు

సంతోషంగా ఉంది

- ప్రణయ, డెన్వర్, అమెరికా



మాది నిజామాబాద్ జిల్లా వర్ని. బతుకమ్మ పండగ వచ్చిందంటే ఆ సందడే వేరు. భారత్‌లో ఉంటే గునుగ పూలు ఉపయోగించేవాళ్లం. ఇక్కడ ఆ పూలు దొరకవు. అమ్మ పద్మ నుంచి పాటలు పాడటం నేర్చుకున్నా. పదేళ్ల క్రితం అమెరికా వచ్చాను. మా ఆయన అర్జున్, నేను ఇక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులం. విధుల్లో ఎంత బిజీగా ఉన్నా సరే. . గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా బతుకమ్మ పండగను తప్పకుండా నిర్వహించుకుంటాం. బంతిపూలతో పాటు ఇక్కడ దొరికే గులాబీ తదితర పూలతో పేర్చి పూజిస్తున్నాం. ఈ సారి మా అమ్మ ఇక్కడికి వచ్చింది. ఆమెతో కలిసి పండగ చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. చిన్నప్పటి రోజులు గుర్తుకొస్తున్నాయి.

సురక్షితంగా వేడుకలు

- కమ్మర్‌పల్లి వాసి పద్మజ, ఇజ్రాయెల్

అందరూ అనుకుంటున్నట్లు ఇజ్రాయెల్‌లో ఎలాంటి ఇబ్బందులు లేవు. ఉపాధి కోసం ఇక్కడికి వచ్చిన తెలంగాణ వాసులమంతా సురక్షితంగా ఉన్నాం. బతుకమ్మ వేడుకలను ఆనందంతో నిర్వహించుకుంటున్నాం. శ్యామల, రజిత, మౌనిక, నవ్య, లక్ష్మి, భూదేవి, అనితలతో కలిసి బతుకమ్మ ఆడుతున్నాను. తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు సోమ రవి, కార్యదర్శి వివేక్, కోశాధికారి సాయికుమార్, ప్రేమ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సంబరాలను జరుపుకొంటున్నాం. స్థానికంగా దొరికే పూలతోనే బతుకమ్మలను తయారు చేస్తున్నాం. ఏ దేశంలో ఉన్నా మన సంప్రదాయం మరవం.

కొరియర్‌లో పూలు తెప్పించాం


- తేజస్విని, లండన్



నిజామాబాద్ జిల్లా కేంద్రం వినాయక్‌నగర్ అశోక్‌టవర్స్‌కు చెందిన మేము పదేళ్ల క్రితం ఉద్యోగరీత్యా లండన్ వచ్చాం. నాకు బతుకమ్మ పండగ ఎంతో ఇష్టం. ఇక్కడికి వచ్చినా అమ్మవారి పూజలకు అంతరాయం లేకుండా చూసుకుంటున్నా. ఇక్కడ తెలంగాణ వారితో కలిసి సంఘం ఏర్పాటు చేసుకున్నాం. బతుకమ్మ ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నాం. గునుగ, తంగేడు, బంతి, చామంతి తదితర పూలను కొరియర్‌లో తెప్పిస్తున్నాం. ఈ సారి మా అత్తమ్మ నాగలక్ష్మి కూడా రావడంతో సందడి మరింత పెరిగింది. పిల్లలకూ నేర్పిస్తున్నా.

నూతన కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐతో పాటు బోధన్ మైనారిటీ, కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఐటీఐల్లో నూతన కోర్సుల్లో ప్రవేశానికి 5వ తేదీ నుంచి 9 వరకు అవకాశం కల్పిస్తున్నామని జిల్లా కన్వీనర్ యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్ల పైబడినవారు అర్హులని, పూర్తి సమాచారం కోసం https://iti.telangana.gov.in సైట్‌ను సందర్శించాలని సూచించారు.



కామారెడ్డిలో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న విశారదన్ మహరాజ్

సమస్యల పరిష్కారానికి కృషి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ కార్యాలయాన్ని అధినేత విశారదన్ మహరాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లా ఇన్‌ఛార్జిగా లక్ష్మణ్‌ను నియమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బోలేశ్వర్, కో కన్వీనర్ అరవింద్, సభ్యులు పరశురాములు, గంగరాజు, సాయి, సత్యం, లక్ష్మణ్, రాజశేఖర్, నితిన్, అనిల్, రాజు, రాంచంద్రం పాల్గొన్నారు.

44 మంది గైర్హాజరు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఆదర్శ హిందీ విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు 44 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్, సమన్వయకర్త రవీందర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం పదో తరగతి సైన్సు అండ్ టెక్నాలజీ సబ్జెక్టుకి 112కి 88 మంది, ఇంటర్మీడియెట్ కామర్స్‌లో 71కి 56 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన పదో తరగతి హిందీ సబ్జెక్టులో నలుగురికి ఇద్దరు, ఇంటర్మీడియెట్ భౌతికశాస్త్ర పరీక్షలో 46కి 43 మంది రాశారన్నారు.

ఒక్కరికే ఈవోగా పదోన్నతి


నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్‌లకు కార్యనిర్వహణాధికారులుగా శనివారం పదోన్నతులు ఇచ్చారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కేవలం ఒక్కరికే అవకాశం కల్పించారు. బోధన్ చక్రేశ్వరాలయంలో పని చేస్తున్న రాములును నిజామాబాద్ నగరంలోని లక్ష్మీనారాయణ ఆలయానికి ఈవోగా నియమించినట్లు సహాయ కమిషనర్ విజయరామారావు తెలిపారు. కనీసం ఐదుగురు ఈవోలు అవసరం ఉండగా ఒకే పోస్టును భర్తీ చేశారన్నారు. పూర్తిస్థాయిలో ఈవోలను భర్తీ చేయాలని ఉన్నతాధికారులను కోరినట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242



●●● జిల్లా కేంద్రంలోని వికాస్‌నగర్‌లో మురుగు కాల్వ పేరుకుపోయింది. అధికారులు చర్యలు తీసుకోవాలి. - **మహేశ్, వికాస్‌నగర్**

●●● కాలనీలో సిబ్బందితో చర్యలు చేపట్టాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



●●● జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. చర్యలు చేపట్టాలి. - **అశోక్, వినాయక్‌నగర్**

●●● సిబ్బందిని పంపి పరిశుభ్రత చర్యలు చేపట్టాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

●●● జిల్లా కేంద్రంలోని బీడీ కార్మిక కాలనీలో సీసీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. - **రాజశేఖర్, కామారెడ్డి**

●●● రోడ్ల బాగుకు కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం. నిధులు వెచ్చించేందుకు చర్యలు చేపడతాం. - **సుజాత, కమిషనర్**

●●● సంగమేశ్వర్‌లోని కుర్మ సంఘం ప్రాంతంలో విద్యుత్తు లైన్ ప్రమాదకరంగా ఉంది. - **బీరయ్య, సంగమేశ్వర్, దోమకొండ**

●●● పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -**ప్రవీణ్‌కుమార్, ఏఈ ట్రాన్స్‌కో, దోమకొండ**



●●● బాన్సువాడలోని ప్రధాన రహదారిపై పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - **రమేష్, బాన్సువాడ**

●●● ఈ విషయాన్ని ఈఈ ఎస్ఎల్ పట్టణ పర్యవేక్షకుడు సాయికిరణ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సిబ్బంది చేత వీధి దీపాలు బాగుచేయించారు.

●●● మోషంపూర్ గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. మురుగు కాలువలు సరిగా తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. **సంతోష్, గ్రామస్థుడు.**

●●● మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. **నరేష్, పంచాయతీ కార్యదర్శి.**

●●● పిట్లం మండల కేంద్రంలోని నేతాజీ నగర్ కాలనీలో రోడ్ల పక్కన వ్యర్థాలు పేరుకు పోయాయి. వాటిని తొలగించాలి. **రాజేశ్, స్థానికుడు**

●●● వ్యర్థాలు తొలగించేయించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. **పంచాయతీ కార్యదర్శి, యాదగిరి, పిట్లం.**

-న్యూస్‌టుడే, పెద్దకొడప్‌గల్, దోమకొండ ,బాన్సువాడ పట్టణం, కామారెడ్డి పట్టణం, రామారెడ్డి, పిట్లం



మల్లూర్(నిజాంసాగర్), న్యూస్‌టుడే: నిజాంసాగర్ మండలం మల్లూర్ గ్రామంలోని వాటర్ ట్యాంకు(ప్లాస్టిక్) పగిలి నీరు వృథాగా పోతుండటంతో స్థానికుడు సాయిలు ఈనాడు దృష్టికి తేగా గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్ స్పందించారు. ట్యాంకుకు పెన్సిల్ అంటించి నీటి వృథాను అరికట్టారు. దీంతో గ్రామస్థులు అభినందించారు.

ప్రేరణ కలిగేలా.. స్ఫూర్తి చాటేలా

● 'ఇన్‌స్పైర్ మనక్' దరఖాస్తులకు అవకాశం

న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం

భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రాథమిక స్థాయిలోనే పిల్లలకు ప్రేరణ కలిగించాల్సి ఉంటుంది. అందుకు బాల్యంలోనే విజ్ఞాన బీజాలు పడేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతోంది. ఇన్‌స్పైర్ మనక్ 2024-25 కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు యంత్రాంగం దృష్టి పెట్టింది. జిల్లాలో ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులకు అవకాశం కల్పిస్తోంది.



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు (పాత చిత్రం)

తాజాగా రెండోసారి శిక్షణ

ఇన్‌స్పైర్ మనక్ విషయమై గత నెలలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. విధివిధానాలు తెలియజేశారు. తాజాగా రెండో దఫా ప్రభుత్వ, ప్రైవేటు బడులకు సంబంధించి సామాన్యశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. గతంలో జాతీయస్థాయికి వెళ్లిన ప్రదర్శనలకు సంబంధించి గైడ్ ఉపాధ్యాయులతో చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్యం 1621.. పూర్తి 795

ఈ విద్యాసంవత్సరం 1621 మంది విద్యార్థులు కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా లక్ష్యం నిర్దేశించారు. కాగా ఈ నెల 5వ తేదీ వరకు 795 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉంది. మరో 300-500 మంది దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఉన్నత బడులు:	182
విద్యార్థులు	58,115
ప్రైవేటు ఉన్నత బడులు	62
విద్యార్థులు	31,016

అధిగమిస్తాం...

- సిద్దిరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి



ఇన్‌స్పైర్‌మనక్‌కి అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. దీనికి ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ఎలాంటి సందేహాలున్నా సంప్రదించాలి. ఈ సారి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నాం.



మొరం పోసి.. చదును చేయించి

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండ-ముత్యంపేట ఆర్అండ్‌బీ మార్గంలో వారధుల వద్ద ఎత్తుపల్లాలుగా ఉండటంపై ఈనాడులో గత నెల 28న 'ప్రమాదకరంగా వంతెనలు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సమస్య ఉన్న చోట మొరం పోసి చదును చేయించారు.

స్పందనకు వందనం

నేడు గాంధారి ఏఎంసీ ప్రమాణ స్వీకారం

గాంధారి, న్యూస్‌టుడే: గాంధారి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఒక్కేసి పువ్వేసి ఉయ్యాలో..



కామారెడ్డి శ్రీకృష్ణమందిర్ సమీపంలో..



బాన్సువాడ పట్టణం: ఆర్టీసీ డిపోలో..



కృష్ణాజివాడిలో ..



పాత బాన్సువాడలో..



కామారెడ్డిలో బతుకమ్మతో ..

ఒక్కేసి పువ్వేసి ఉయ్యాలో.. గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళలు ఆడిపాడారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే బృందం**




కామారెడ్డి అశోక్‌నగర్‌లో



భిక్కనూరులో సంబరాల్లో చిన్నారులు

నిమజ్జనం..భలే

బతుకమ్మ ఆడటం పూర్తయ్యాక సమీప చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. కానీ, పట్టణానికి తటాకాలు, కుంటలు దూరంగా ఉండటంతో ఆడిన చోటే నిమజ్జనం చేసేలా పురపాలకశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్‌కాలనీలో కృత్రిమంగా నీటి కుండీలను ఏర్పాటు చేశారు. ఇలా సద్దుల బతుకమ్మ వరకు అందులోనే నిమజ్జనం చేయనున్నారు.



-న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



బోరును ప్రారంభించిన పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

దేవునిపల్లి(కామారెడ్డి పట్టణం): జిల్లా కేంద్రం పరిధిలోని దేవునిపల్లిలో రెండు పడకల గృహ సముదాయం వద్ద ఆదివారం నూతన బోరును పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రజావేదిక కార్యక్రమాలు

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై ఇటీవల సామాజిక తనిఖీలు నిర్వహించారు. సోమవారం నుంచి ప్రజావేదిక ఏర్పాటు చేసి లోపాలు వెల్లడిస్తామని సంబంధిత అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.

ఫలితాల విడుదల సరికాదు

మాచారెడ్డి, న్యూస్‌టుడే: ఏబీసీడీ వర్గీకరణ చేయకుండా ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలు విడుదల చేయడం సరికాదని, ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. మాచారెడ్డిలో నాయకులు ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు వెంకటరాములు, బాబు, దేవరాజు, దేవయ్య తదితరులు ఉన్నారు.



నూతన కార్యవర్గం ఎన్నిక

పిట్లం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని దక్షిణముఖి హనుమాన్ ఆలయంలో ఆదివారం రేణుకామాత(ఎల్లమ్మ) గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిరిపెద్ద శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా సాయాగౌడ్, రవిగౌడ్, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా మొగులాగౌడ్, కోశాధికారిగా రామకృష్ణ గౌడ్, వెంకటేశ్‌గౌడ్, సలహాదారులుగా రామాగౌడ్, రమణగౌడ్, కాశాగౌడ్, వెంకటేశ్‌గౌడ్‌ను నియమించినట్లు కులసంఘ సభ్యులు తెలిపారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం

దోమకొండ, న్యూస్‌టుడే: బిక్కనూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కదిరె గోపాల్‌రెడ్డిని దోమకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ ఛైర్మన్‌కు..

దోమకొండ, న్యూస్‌టుడే: గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియామకమైన మద్ది చంద్రకాంత్‌రెడ్డిని దోమకొండ యువజన కాంగ్రెస్ నాయకులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో అమీర్ హుస్సేన్, సురేశ్‌గౌడ్, శిరీష్‌గౌడ్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిమార్గం ఎంచుకోవాలి

బీర్కూర్ : ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని బీర్కూర్‌వాసి, వరంగల్ జిల్లా వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ హన్మాండ్లు పేర్కొన్నారు. బీర్కూర్ పోచమ్మ విగ్రహానికి రూ. 22వేలతో తయారు చేసిన ఒడ్డాణాన్ని ఆదివారం కమిషనర్ దంపతులు సమర్పించారు. . మాజీ సర్పంచి గంగారం, విఠల్, సురేష్, గాలయ్య, పవన్ ఉన్నారు.

ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు

పిట్లం, న్యూస్‌టుడే: పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని త్రిశూల్ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు రష్మిత, క్లబ్ అధ్యక్షుడు కాశిరెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, ఆసుపత్రి యాజమాన్యం సుభాకర్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నేడు

గాంధారి, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు ఉప కేంద్రంలో సోమవారం ఉదయం 10:30 గంటలకు 'విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు డీఈ విజయ్ సారథి, భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. గాంధారి, సర్వాపూర్, కొటపల్లిసంగారెడ్డి, లింగంపేట్ కేంద్రాల పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీబీపేట కళాశాలకు రెండు పోస్టులు మంజూరు

దోమకొండ, న్యూస్‌టుడే: బీబీపేట జూనియర్ కళాశాలకు ఇటీవల ఆంగ్లం, రసాయనశాస్త్రం పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసిందని దోమకొండ కళాశాల ప్రిన్సిపల్ శంకర్ తెలిపారు. ఆ రెండు పోస్టులను కేటాయించడంతో పాటు త్వరలో మరిన్ని అతిథి అధ్యాపక పోస్టులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. బీబీపేట కళాశాలలో ఈ నెల 15 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



దోమకొండలో బోనాలు..



బీబీపేటలో..



బీబీపేటలో కుంకుమ పూజ



మాచారెడ్డి: ఫరీద్‌పేటలో అన్నదానం..



పాత బాన్సువాడలో..

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. లలితాత్రిపురసుందరి దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు కుంకుమార్చనలు నిర్వహించారు. దాతల సహాయంతో అన్నదానాలు చేశారు.

- న్యూస్‌టుడే బృందం



బాన్సువాడ పట్టణంలో..



కామారెడ్డి శారదాంబ ఆలయంలో



ఎల్లారెడ్డి : 56 రకాల వంటకాలతో..



కుర్తిలో భజనలు



రామారెడ్డి : పోసానిపేట్‌లో..



నాగిరెడ్డిపేట్: తాండూరులో



గాంధారిలో.



తాడ్వాయిలో ..



కోమలంచలో ..



లింగంపేటలో ..



దోమకొండ చాముండేశ్వరీ ఆలయంలో



కామారెడ్డి కల్కినగర్‌లో..



బాన్సువాడ పెద్ద హనుమాన్ మందిరంలో...



సదాశివనగర్ : వజ్జెపల్లిలో ..



కామారెడ్డి పెద్దబజార్ వద్ద ...



సురేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సీతాలే రమేష్

ఆర్థిక సాయం అందజేత

బీర్కూర్: కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న పొతంగల్‌కు చెందిన సురేష్ పెద్ద పేగు ఇన్‌ఫెక్షన్ కావడంతో శస్త్రచికిత్సకు రూ. లక్ష వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న బీర్కూర్ పీఎంపీ వైద్యుడు సీతాలే రమేష్ స్నేహితులు, ఇతర దాతల నుంచి విరాళాలు సేకరించి రూ. 45 వేల నగదును ఆదివారం సురేష్ కుటుంబానికి అందజేశారు.

దోమకొండ: దోమకొండకు చెందిన కామిండ్ల నర్సవ్వ అనారోగ్యానికి గురి కావడంతో, ఆమె కుటుంబానికి దోమకొండ ముదిరాజ్ సేవాసమితి ప్రతినిధులు రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. ప్రతినిధులు పున్న లక్ష్మణ్, నాగారపు ఎల్లయ్య, రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన సత్యనారాయణకు మంజూరైన రూ. 28,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ అందజేశారు. నాయకులు నగేష్, భైరయ్య, సంగయ్య, మదర్‌పాషా పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: మాచాపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మహమ్మద్ ముక్తార్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశానుసారం మాజీ మున్సిపల్ ఛైర్మన్ సత్యనారాయణ బాధిత కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సహాయం చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిత, జడ్పీటీసీ మాజీ సభ్యులు ఉషాగౌడ్, సామెల్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, నారాగౌడ్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి



నారాయణ

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ రేషన్ డీలర్ మృతి చెందిన ఘటన మీర్జాపూర్‌లో చోటుచేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్జాపూర్‌కు చెందిన జంగిలి నారాయణ (60) 20 ఏళ్ల నుంచి స్వగ్రామంలో రేషన్ డీలర్‌గా పని చేస్తున్నారు. 15 రోజుల కిందట ఇంట్లో నిద్రిస్తుండగా మంచంపై నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానాలో రెండు రోజులు చికిత్స చేయించుకున్నారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. 13 రోజులు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

రామారెడ్డి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిపేట గ్రామానికి చెందిన శెట్టిపల్లి లక్ష్మీ(58) అనారోగ్యంతో బాధపడుతుండేది. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో దూలానికి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీని ఢీకొట్టిన వ్యాను, చోదకుడి దుర్మరణం

భిక్కనూరు, న్యూస్‌టుడే: లారీని వెనక నుంచి డీసీఎం వ్యాను ఢీకొట్టిన ఘటనలో చోదకుడు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి కామారెడ్డి జిల్లా భిక్కనూరు శివారులో చోటుచేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ షేక్ అబిద్(36), క్లీనర్ గొండల్‌వార్ సంతోష్ డీసీఎం వ్యానులో హైదరాబాద్ నుంచి వస్తున్నారు. రామేశ్వరపల్లి బ్రిడ్జి దాటిన తర్వాత జాతీయ రహదారి 44పై ముందుగా వెళ్తున్న లారీని డీసీఎం బలంగా ఢీకొట్టింది. ఘటనలో గాయాలపాలైన ఇద్దరిని జిల్లా ఆసుపత్రికి అంబులెన్సులో తరలించారు. డ్రైవర్ షేక్ అబిద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. క్లీనర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాన్సువాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని పాతబాన్సువాడకు చెందిన ర్యాల సాయిరెడ్డి మృతిచెందగా.. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి కుమారుడు వెంకట్రామ్‌రెడ్డి డీఆర్డీవోలో సతీష్‌రెడ్డితో కలిసి పని చేశారు. మృతి చెందిన విషయం తెలిసిన ఆయన బాన్సువాడకు వచ్చి పరామర్శించారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి

సైబర్ నేరాలపై అవగాహన

గాంధారి, న్యూస్‌టుడే: మండలంలోని గండివేట్ గ్రామస్థులకు సీఎఫ్ఎల్(ఎస్ఎస్‌టీ) స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు, నగదు రహిత లావాదేవీలు, పొదుపు పథకాలు, బ్యాంకింగ్ సేవలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కళాజాత బృందం సభ్యులు పాటల రూపంలో వివరించారు. ఎస్ఎస్‌టీ కౌన్సిలర్లు రాజశేఖర్, సంతోష్, మోహన్, జిల్లా సమన్వయకర్త శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.